క్లుప్తంగా

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

చిక్కడపల్లి: ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారు. సికింద్రాబాద్ బోనాల జాతర సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, రాకేష్‌కుమార్‌లతో కలిసి ఏర్పాట్లను ఎమ్మెల్యే సమీక్షించారు.

మత సామరస్యానికి ప్రతీక బోనాలు



లష్కర్ బోనాల ఉత్సవాల్లో బీజేపీ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మత సామరస్యానికి ప్రతీక రాష్ట్రంలో జరిగే బోనాల పండుగ అని రాజ్యసభ ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో జరిగిన లష్కర్ బోనాల ఉత్సవాల్లో బీజేవైఎం మాజీ అధ్యక్షులు గుండగోనీ భరత్‌గౌడ్‌తో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రైతులు పాడిపంటలతో సమృద్ధిగా అభివృద్ధి చెందాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలి

కాచిగూడ: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ అన్నారు. ఆదివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నాపత్రాల లీకేజీతో నష్టపోయిన వారికి నిరుద్యోగభృతిని వర్తింపజేయాలన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులు తమకు ఉద్యోగాలు రావనే నిరాశతో ఉన్నారని తెలిపారు. జీవనోపాధి లేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తుంగబాయి, లక్ష్మయ్య, అలీం, ప్రశాంత్ నిమ్‌కర్, భూషణ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ కల్యాణం



అంబర్‌పేట: గోల్నాక డివిజన్ శంకర్‌నగర్ బస్తీలోని అమ్మవారి దేవాలయంలో ఎల్లమ్మ కల్యాణం ఘనంగా నిర్వహించారు. గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్ రెడ్డి, కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

జేపీ నడ్డాకు ఘనస్వాగతం



స్వాగతం పలుకుతున్న డాక్టర్ ఎన్.గౌతంరావు

కాచిగూడ: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదివారం నగరానికి వచ్చిన సందర్భంగా బేగంపేట ఎయిర్‌పోర్టులో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు ఆయనకు స్వాగతం పలికారు. పూలబొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. పార్టీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, కేశబోయిన శ్రీధర్, వినోద్‌యాదవ్, నంద కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ టీచింగ్ కోర్సు దరఖాస్తులకు ఆహ్వానం

చిక్కడపల్లి: కేంద్ర ప్రభుత్వంచే గుర్తింపు పొందిన సర్టిఫికేషన్ టెక్ విహాన్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ప్రీ ప్రైమరీ టీచింగ్ శిక్షణ కోర్సుల్లో (రెగ్యులర్, కరస్పాండెట్) చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెంటర్ డైరెక్టర్ కొంగర శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. చైల్డ్ సైకాలజీ, టీచింగ్ మెథడ్స్, చైల్డ్ హెల్త్‌కేర్, స్కూల్–అడ్మినిస్ట్రేషన్, మేనేజ్‌మెంట్, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ కోర్సులు, ప్రాక్టికల్స్ అంశాల్లో 45 రోజుల పాటు క్రాష్ కోర్సులో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ అభ్యర్థులకు ఫీజుల్లో రాయితీ ఉంటుందన్నారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ అర్హత కలిగిన వారు ఈనెల 15 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

కాచిగూడ: ఓ గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అడ్మిన్ ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు (70) కాచిగూడ రైల్వేస్టేషన్ వెనుక వైపు రోడ్డుపైన మృతిచెంది ఉన్నాడు. కాగా పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎటు చూసినా.. మట్టికుప్పలే!

- డంపింగ్ యార్డుగా కృష్ణానగర్
- దోమల విజృంభన, ప్రబలుతున్న రోగాలు
- పట్టించుకోని శానిటేషన్ అధికారులు
- తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రజలు



నిరుపయోగంగా మారిన ఫుట్‌పాత్‌లు ఇలా..

కాచిగూడ: గోల్నాక డివిజన్ కృష్ణానగర్ బస్తీలో ఫుట్‌పాత్‌లపై వ్యర్థాలు కుళ్లిపోయి గత నెల రోజులుగా భరించలేని దుర్గంధం వ్యాపిస్తోంది. చెత్త పేరుకుపోవడంతో దోమలు, ఈగలు, ఎలుకలు, పందికొక్కులతో పాటు క్రిమికీటకాలు స్వైర విహారం చేస్తున్నాయి. దీనికి తోడు గత కొద్ది రోజుల నుంచి చెత్త, మట్టికుప్పల సమస్య మరింత జటిలంగా మారింది.

రోగాల బారిన ప్రజలు..

> అసలే వర్షాకాలం పక్కనే కుళ్లిన వ్యర్థాలతో భరించలేని వాసన కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న దోమలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించినా.. పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- ఇటీవల పలువురు జ్వరాల బారినపడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. పలు రకాల రోగాలతో అసుపత్రుల్లో చేరుతున్నా.. నెల రోజులుగా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వశాఖల మధ్య సమన్వయ లోపం..

- వర్షాకాలం సమీపించినా రోడ్ల ప్యాచ్‌వర్క్‌లు పూర్తిచేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్‌శాఖల అధికారుల మధ్య సమన్వయం లోపించింది. రోడ్లు గుంతలు పడి నడవడానికి వీలులేకుండా ఉంది. ఫుట్‌పాత్‌లపై మట్టికుప్పలు, చెత్తాచెదారం, నిరుపయోగ సామగ్రి పేరుకుపోయి ఇబ్బందికరంగా మారింది. వివిధ శాఖల అధికారులు సమన్వయ లోపంతో అనాలోచిత చర్యలకు పూనుకుంటున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాలు

విద్యుత్ స్తంభాలు మార్చాలి..



కృష్ణానగర్ బస్తీ ముత్యాలమ్మ ఆలయం వద్ద విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఆరు నెలల నుంచి ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. బోనాల వేడుకలు సమీపిస్తున్నందున వెంటనే విద్యుత్ మరమ్మతులు చేపట్టి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– జి.చంద్రప్రకాష్, కృష్ణానగర్

అధికారులు తక్షణమే స్పందించాలి..

పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని పలుసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఎక్కడికక్కడే చెత్తకుప్పలు పేరుకుపోవడంతో ఈగలు, దోమలు ఉధృతం అవుతున్నాయి. పిల్లలు విషజ్వరాల బారిన పడుతున్నారు. దీనిపై అధికారులు తక్షణమే స్పందించాలి.

– ఇ.సత్యనారాయణ, ప్రైవేట్ ఉద్యోగి

మట్టి కుప్పలకు నిలయాలుగా ఫుట్‌పాత్‌లు



ఎక్కడ చూసినా మట్టికుప్పలే కనిపిస్తున్నాయి. లక్షల రూపాయలు ఖర్చుపెట్టి ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు మట్టి దిబ్బలకు నిలయాలుగా మారాయి. పరిశుభ్రత కోసం బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ సమస్యపై చొరవ చూపాలి.

– కె.ప్రమీల, గృహిణి

భగవద్గీత ఉపనిషత్తుల సారం



ప్రశంసాపత్రాలను అందుకున్న చిన్నారులు

శంకరమఠంలో చిన్నారులకు భగవద్గీత పఠన పోటీలు

నల్లకుంట: భగవద్గీత ఉపనిషత్తుల సారమని శంకర మఠం నల్లకుంట శాఖ హెడ్ కె. కృష్ణారావు అన్నారు. భగవద్గీతలో భగవంతుని తత్వం, ఆత్మతత్వం, జీవన గమ్యం, గమ్య సాధనాయోగములు బోధింపడినవన్నారు. తమ పిల్లలు భగవద్గీత చదివేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. గీతా ఫౌండేషన్, లక్ష్య సాధన ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలో చిన్నారులకు భగవద్గీత పఠన ఫైనల్ పోటీలను నిర్వహించారు. రెండు విభాగాల్లో ఈ పోటీలను నిర్వహించగా 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బడేసాబ్ అధ్యక్షతన కార్యక్రమానికి శంకరమఠం నల్లకుంట బ్రాంచ్ హెడ్ కృష్ణారావు అతిథిగా హాజరై మాట్లాడారు. భగవద్గీత చదివితే చిన్నారులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. విశిష్ట అతిథి ప్రముఖ కవి విమర్శకుడు గంటా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. భగవద్గీత ప్రతి ఇంట్లో ఉండాలని సూచించారు. కష్టాల్లో ఉన్నప్పుడు భగవద్గీత పుస్తకాన్ని చదివి జీవనగీతగా మార్చుకోవాలని విద్యార్థులకు వివరించారు. భగవద్గీత పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విశ్వేశ్వరరావు, రాజగోపాల్, సంధ్య, గీతా ఫౌండేషన్ చైర్మన్ గంగు భరత్‌కుమార్ శర్మ, లక్ష్యసాధన ఫౌండేషన్ చైర్మన్ ప్రజ్ఞా రాజు కన్వీనర్ పాండుయాదవ్ పాల్గొన్నారు. విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

మన సంస్కృతికి ప్రతీక బోనాలు

కవాడిగూడ: సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్రంలో జరిగే బోనాల, పండుగకు ఎంతో విశిష్టత ఉందని హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆషాఢమాసంలో జరిగే బోనాల పండుగను పురస్కరించుకుని ఆదివారం కవాడిగూడ కొత్తబజార్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉజ్జయిని మహంకాళి ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమానికి బండారు దత్తాత్రేయ, బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ రవీందర్, చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, గాంధీనగర్ సీఐ మోహన్‌రావు, ఎస్సై కావ్యలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు సురేష్‌ముదిరాజ్ వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.



మున్నూరుకాపులను ఏకం చేయడమే లక్ష్యం



మాట్లాడుతున్న మణికొండ వెంకటేశ్వర్‌రావు

కాచిగూడ: రాష్ట్రవ్యాప్తంగా మున్నూరుకాపులను ఐక్యంచేసే దిశగా మహాసభ నిరంతరం కృషి చేస్తోందని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మున్నూరుకాపు బర్కత్‌పుర నేత వివేక్‌ఆనంద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. జనాభా పరంగా అన్ని కులాల కంటే అధికంగా ఉన్నా.. ఐకమత్యం లేకపోవడంతో ప్రభుత్వాలు, పార్టీలు మున్నూరుకాపులను నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యత కోసం పనిచేసేందుకు ముందుకొస్తే మహాసభ అన్ని విధాలుగా సహకారం అందిస్తుందన్నారు. సింగర్ మాలవిక ఆనంద్, డాక్టర్ పీఎల్‌ఎస్ పటేల్, బేతి శ్రీధర్, మురళీధర్, నాగరాజు, పోతాని నర్సింగ్‌రావు, యాదగిరి పటేల్, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో సానుకూల మార్పునకు కృషి



జేసీఐ జాతీయ అధ్యక్షుడు ఎంకే కార్తికేయన్ తదితరులు

కాచిగూడ: సమాజంలో సానుకూల మార్పును సృష్టించడానికి నాయకత్వ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసేందుకు జేసీఐ బంజార పనిచేస్తుందని జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) జాతీయ అధ్యక్షుడు ఎం.కే.కార్తికేయన్ అన్నారు. ఆదివారం నిర్వహించిన 'దృష్టి' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మెరుగైన భారతదేశం కోసం జేసీఐ బంజారా హైదరాబాద్ ఓ విజన్ పేరుతో ఒకే స్థిరమైన ప్రాజెక్టును చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే రెండు దశల్లో 38 క్యాటరాక్ట్ కంటి ఆపరేషన్లను చేయించామన్నారు. 50 క్యాటరాక్ట్ ఆపరేషన్‌లను విరాళంగా అందించిందన్నారు. ఈ ఏడాది చివరి నాటికి జేసీఐ బంజారా ఈ ప్రాజెక్టు కింద 250 మందికి పైగా క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేయనుందన్నారు. రమేష్ దడిగల, పంకజ్ సర్దా, విధి గుప్తా, జేసీ అభిషేక్ బక్కడ్, పంకజ్ కపూర్, దేవేందర్ లుహాదియా, ముకుంద్ బహేతి, రవిరాతి, సుభాష్‌జీ లోహడే తదితరులు పాల్గొన్నారు.

మెస్‌చార్జీలకు అనుగుణంగా మెనుని అమలు చేయాలి



మాట్లాడుతున్న తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు జిల్లాపెల్లి అంజి

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్ విద్యార్థుల మెస్‌చార్జీలను రూ.1500 నుంచి రూ.2000 వరకు పెంచిందని పెంచిన చార్జీలకు అనుగుణంగా హాస్టల్స్‌లో మెనుని అమలు చేయాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లాపెల్లి అంజి డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ ఫీజు రియంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లు రూ.5000 కోట్లను తక్షణమే విడుదల చేయాలన్నారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌ను రూ.5,500 నుంచి రూ. 20వేలకు పెంచాలని సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. బీసీ హాస్టళ్లకు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని 119 గురుకుల పాఠశాలలను ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీసీ విద్యార్థుల డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తామన్నారు. విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిళ్ల సతీష్, నరేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ దోహదం



విద్యార్థులకు గ్రేడింగ్, ప్రశంసా పత్రాలను అందజేస్తున్న దృశ్యం

కాచిగూడ: మార్షల్ ఆర్ట్స్ మనల్ని మనం రక్షించుకోవడంతో పాటు ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్ అన్నారు. జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడలోని నృపతుంగ హైస్కూల్‌లో నిర్వహించిన బెల్ట్ గ్రేడ్‌పరీక్షల్లో ఉత్తీర్ణులైన కరాటే విద్యార్థులకు కలర్ బెల్ట్స్, సర్టిఫికెట్లను అందజేశారు. హెల్త్‌లీగ్, కర్ణాటక సాహిత్య మందిర్ సెంటర్స్ విద్యార్థులు బెల్ట్‌గ్రేడింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణులై అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. హెల్త్‌లీగ్ సెంటర్ కోచ్ మాస్టర్ దామోదర్‌నాయక్, కర్ణాటక సాహిత్య మందిర్ ఇన్‌స్ట్రక్టర్ కృష్ణ మాస్టర్, సురేంద్ర కులకర్ణి, రాఘవేంద్ర దేశాయ్, ముకుంద్ కులకర్ణి, డీఎస్ రావు, ప్రదీప్ దేశ్‌పాండే, శాంతి స్వరూప్‌లీలే తదితరులున్నారు.

మణిపూర్ ఘటనపై కేంద్రం స్పందించాలి

కాచిగూడ: మణిపూర్ ఘటనపై ప్రధాని, కేంద్రం స్పందించాలని ఏఐవైఎఫ్ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ ఎంపీ సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న పాలకులను గద్దె దించాలంటే ప్రజాస్వామ్య లౌకిక శక్తులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐవైఎఫ్ జాతీయ వర్క్‌షాప్ రెండోరోజు సెషన్ ఆదివారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ప్రస్తుతం మణిపూర్‌లో నెలకొన్న సంక్షోభం రాజకీయ సమస్య అని దీని పరిష్కారం కూడా రాజకీయంగానే చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం హింసను ఆపి శాంతిని నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దినేష్, రఘునాథ్, జిస్మాన్, లెనిన్‌బాబు, అరుణ్, విక్కీ, హరీష్ బాల, భారతి, కరంవీర్‌కౌర్, వల్లి ఉల్లాఖాద్రీ, కె.ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ



చిక్కడపల్లి: ఉజ్జయిని మహంకాళి ఆలయం అమ్మవారికి జోగిని ఆవిక పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె ఆలయం వద్దకు పోతరాజు రూపంలో ఊరేగింపుగా వెళ్లారు. పలువురు భక్తులు గుర్రం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 60 సీట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు మురళీకృష్ణ

నల్లకుంట: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం బీసీ, ఎంబీసీ, డీఎన్‌టీ కులాలకు 60 ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని తెలంగాణ బీసీ జాగృతి ఆయా రాజకీయ పార్టీలను డిమాండ్ చేసింది. ఆదివారం నల్లకుంట డివిజన్ పరిధిలోని రత్నానగర్ కార్యాలయంలో తెలంగాణ బీసీ జాగృతి సమావేశం నిర్వహించారు. దీనికి హాజరైన జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ. మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి కత్తుల సుదర్శన్, లింగంగౌడ్‌తో కలిసి మాట్లాడారు. బీసీ ఆత్మ గౌరవ భవనాల నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాలేదని వాటిని వెంటనే పూర్తి చేయించాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి బీసీ గణన చేపట్టి, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలన్నారు. చట్ట సభల్లో బీసీ రిజర్వేషన్లు అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బీసీ జాగృతి రాష్ట్ర కార్యదర్శి పాతకోటి మహేష్, అంబర్‌పేట కన్వీనర్ దిలీప్‌కుమార్, లాలయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బోనాలు, కల్యాణోత్సవానికి ఆలయాలు ముస్తాబు



బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు



మొదటి బోనం తీసుకెళ్తున్న వై.చంద్రమౌళి కుటుంబ సభ్యులు

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ ఆర్టీసీక్రాస్‌రోడ్స్ జవహర్‌నగర్‌లోని పోచమ్మ దేవాలయంలో అమ్మవారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆలయ అధ్యక్షులు ఎ.కనకరాజు, ప్రధానకార్యదర్శి ఎస్.ఏసురత్నం, కోశాధికారి శ్రీరాములు, సలహాదారు నిరంజన్ తెలిపారు. ఈనెల 12న బుధవారం ఉదయం జరిగే ఈ కల్యాణోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. కాగా 11 న గణపతి పూజ, నవగ్రహ పూజ, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. 16న బోనాల పండుగ జరగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

ఘనంగా బోనాల వేడుకలు...

- గాంధీనగర్ డివిజన్‌లోని పలు అమ్మవారి ఆలయాల్లో ఆదివారం బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బోనాల పండుగ సందర్భంగా ఆదివారం డివిజన్‌లోని చిక్కడపల్లి ఆంధ్రా బ్యాంక్‌లేన్‌లోని నల్లపోచమ్మ ఆలయం, చిక్కడపల్లి, బాపునగర్, రాజరాజేశ్వరి, పోచమ్మ ఆలయం, గాంధీనగర్ ముత్యాలమ్మ దేవాలయంలో మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించారు.

చిక్కడపల్లి: గాంధీనగర్‌లో డివిజన్‌లోని నగరంలో ప్రసిద్ధి గాంచిన జవహర్‌నగర్ నల్లపోచమ్మ, ఉప్పలమ్మ ఆలయంలో ఆషాడమాస బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం కమిటీ చైర్మన్ బాబ్జి, గౌరవ అధ్యక్షుడు శీలం సత్యనారాయణ, సలహాదారుడు మారిశెట్టి నర్సింగ్‌రావులు మాట్లాడుతూ.. వచ్చే ఆదివారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ నెల 17 న ఫలహారం బండి ఊరేగింపు, 18న అమ్మవారి ఉత్సవ విగ్రహాల రథ యాత్ర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. యాదగిరి, ప్రభాకర్, శివ, కనకరాజు తదితరులున్నారు.

ముషీరాబాద్: మహంకాళి అమ్మవారిని ఆలయ కమిటీ ప్రధాన అర్చకుడు, ఎక్స్ అఫీసియో మెంబర్ వై.చంద్రమౌళి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శివాలయం చౌరస్తా నుంచి భక్తిశ్రద్ధలతో డప్పు వాయిద్యాలు, శివసత్తులు, పోతరాజుల నృత్యాల నడుమ అమ్మవారి బోనాన్ని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి నైవేద్యం సమర్పించారు. వై.చంద్రమౌళి మాట్లాడుతూ.. గత 17 ఏళ్లుగా అమ్మవారికి ప్రతి ఆషాడమాసంలో తమ ఇంటినుంచే మొదటి బోనం సమర్పిస్తామన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, మాజీ చైర్మన్ సంగిశెట్టి రాజ్‌కుమార్, గౌరీశంకర్, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

- ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బోనాల సందడి మొదలైంది. కవాడిగూడ డివిజన్‌లోని ఉన్ని కోటలో జరిగిన ఉత్సవాల్లో బీఆర్‌ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. రాంనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రావులపాటి మోజెస్ ఆధ్వర్యంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలతో భారీ ప్రదర్శన చేశారు.